# గుడ్డిగవ్వ

**– నిడదవోలు మాలతి**

చెరువొడ్డున ఇసకలో కాళ్లీడ్చుకుంటూ నడుస్తున్న ముత్యం కళ్లు తళుక్కుమన్నాయి, తనముందు గజం దూరంలో సమాధో, సన్‌బేదింగో చేస్తున్నట్టు కనిపిస్తున్న గవ్వని చూడగానే. రెండు నెలవంకల నడుమ జెఱ్రిపోతు పడుకున్నట్టు కనిపిస్తూ అతనికన్నునాకట్టుకుంది ఆ గవ్వ చిన్నదే అయినా. చుట్టూ పరుచుకున్న ఇసకరేణువులు ఎండకి మెరుస్తూ ఓ వింతశోభని తెచ్చిపెట్టాయి ఆగవ్వకి. ముత్యం చూస్తూ నిలబడిపోయాడు కొంతసేపు. అక్కడే వదిలేస్తే మరో పసివాడి మనసుని ఉల్లాసపరుచునేమో. ముత్యం వంగి, దాన్ని తీసుకుని, చేత పుచ్చుకుని, ఎత్తి చూశాడు. అడుగువేపున ఆవగింజంత కన్నంలోంచి పుంజీడు ఇసకరేణువులు పొడగట్టేయి అతని కంటికి. అది అలా చేత్తో పుచ్చుకునే మరో పది అడుగులు వేశాడు. మరుక్షణంలో అతడికి దానిమీద విసుగేసింది, ఒంట్లో గల బలాన్నంతా కూడగట్టుకు, వీలయినంతమేరకి నీటిలోకి విసిరేడు. అప్పుడప్పుడూ అతను గులకరాళ్లని విసురుతాడు. మామూలుగా ఓమోస్తరు పలకలు దేరిన రాయి అయితే నీటిమీద రెండు కప్పగంతులేసి మునిగిపోతుంది. కాని ఈరోజు ముత్యం విసిరిన గుడ్డిగవ్వకి చిల్లుండడం మూలాన బుడుంగుమని పడ్డచోటనే మునిగిపోయింది.

★★★

ఇంటికొచ్చి, లోపలికి పోబోతూంటే, బాబీ కనిపించాడు ముందు వసారాలో కూచుని, తెల్లబల్లమీద పులీ–మేకా గళ్లు గీసి తనకోసం ఎదురు చూస్తూ. ఈమధ్యనే అతనికి ఆ ఆట నేర్పేడతను. ముత్యం నవ్వుతూ కూచున్నాడు. పదనిముషాలయిందో లేదో వనజ పిలిచింది. ''ముత్యం, ఓమారిటొచ్చి రెండు కరివేపాకు రెమ్మలందుకో,'' అంది వంటింట్లోనించి పోపు వేయబోతూ. ముత్యం లేవబోతూంటే. ఊహు, అంటూ బాబీ అతని చెయ్యి పుచ్చుకు లాగేడు. ''ఇప్పుడే వచ్చేస్తా,'' నంటూ సైగ చేసి ముత్యం లేచాడు. కాని, ఇద్దరికీ తెలుసు, ముత్యం లేచాడంటే, అంత తొరగా వెనక్కి రావడం జరగదు. బాబీ మొహం ముడుచుకు ముందున్న పావులు విసిరేసి, లేచి వెళ్లిపోయాడు.

లోపల వనజ వంటింట్లో కూరలూ, గిన్నెలూ, పప్పులూ, ఉప్పులూ ఒక్కొక్కటే అమర్చుతూంది. మరో గంటలో చుట్టాలు దిగుతారు. గిరిబాబుకి ఇంటరులో ఇంగ్లీషు చెప్పిన శేఖరం వాళ్ల అమ్మా, నాన్నలకి దేశం చూపించడానికి కార్లో బయల్దేరాడు. దూరప్రయాణాలకి ప్లేనెక్కినా, శేఖరం వీలయినంతవరకూ కారులో వెళ్లడానికే ఇష్టపడతాడు, దారిలో అవసరం అయినప్పుడు ఆగొచ్చని. అంచేత ఓంప్రథమంగా తల్లిదండ్రులని తీసుకుని దగ్గర ఊళ్లు చూపించడానికి కారులో బయల్దేరాడు.

మధ్యాహ్నం పన్నెండయింది. గిరికి ఆఫీసు అట్టే దూరం కాదు. రోజూ కాకపోయినా అవసరం అయినప్పుడు లంచికి రాగల దూరమే. అంచేత ఇవాళ చుట్టాలొస్తున్నారని లంచివేళకి ఇంటికొచ్చాడు. అతను తలుపు దగ్గరికి వచ్చేసమయానికే శేఖరం కారు ఇంటిముందు ఆగింది. గిరి నవ్వుతూ రెండడుగులేసి నిలుచున్నాడు వాళ్లు కారు దిగేవరకూ.

కారాపి, శేఖరం దిగి, తల్లిదండ్రులు దిగింతరవాత సామాను దింపబోతూంటే, గిరి దగ్గరికి వచ్చాడు.

పెద్దలకి నమస్కారాలు చెప్పి, మప్పితంగా, ''అయ్యో. మీరు పదండి. నేను తెస్తాను సామాను,'' అంటూ అడ్డు పడ్డాడు గిరి. అంటే నిజంగా తను తెస్తాడని కాదు. కళ్లతోనే ముత్యానికి సౌంజ్ఞ చేశాడతను సామానుగురించి..

శేఖరం మొహమాటపడుతూనే పెట్టె వదిలేసి, గిరిని అనుసరించాడు. ఆవెనక సోమయ్యగారూ, కోటమ్మగారూ నెమ్మదిగా సాగారు. తలుపు దగ్గర వనజా, ముత్యం నిలబడ్డారు.

ముత్యం మొత్తం మూడు రెళ్లు ఆరు పెట్టెలు అందుకుని, లోపలికి నడిచాడు. పెట్టెలు రెండో అంతస్తులో అతిథుల గదిలో పెట్టి మళ్లీ వంటింటిలోకెళ్లి, కాఫీలు తీసుకొచ్చాడు. గిరి ఇబ్బందిగా చూస్తూ, ''కూచో, నువ్వు కూడా కాఫీ తెచ్చుకో,'' అన్నాడు కాని ముత్యం కూచోలేదు. ఏమందన్నట్టు అటు చూసి, తల తాటించి, వెళ్లిపోయాడు, లోపలికి.

కోటమ్మ సాయం చేయ్యనా అంటూ వంటగదిలో కెళ్లింది కాని అక్కడ ఆవిడకి చేసేదేం కనిపించలేదు.

ముత్యం కరివేపాకు రెమ్మలు వనజ కిచ్చి, అక్కడే నిలబడ్డాడు. ఆవిడ నాలుగు వంకాయలు, కూరలు తరుక్కునే కత్తి అతనిముందు పడేసింది. అతను తలొంచుకు వంకాయలు తరగసాగాడు.

కోటమ్మ వాళ్లిద్దర్నీ చూస్తూ గతం తలబోసుకోసాగింది. ''ఏవిటో కాలం. తలుచుకుంటే నాలుగు తరాలు గడిచిపోయినట్టుంది. నిన్నా, మొన్నా, ఇంటినిండా గలగల్లాడుతో పదిమంది ఆడవాళ్లం తిరిగేవాళ్లం. ఒకరికొకరు పనులు పురమాయించుకోటం లేదు. ఎప్పుడు చూసినా చేతినిండా పనే. ఏరోజు చూసినా ఇల్లు సత్తరవులా ఉండేది, వచ్చేవాళ్లూ, పోయేవాళ్లూను. మాతాత అసలు సహపంక్తిన మరో విస్తరి లేకుండా, అన్నానికి కూచునేవారే కాదు.''

వనజ నవ్వుతూ వినసాగింది. ఇండియానించి వచ్చినవాళ్లకి రెండే విషయాలుంటాయి మాటాడ్డానికి. అయితే ఇక్కడున్న సౌఖ్యాలూ లేకపోతే అక్కడ అడుగంటిపోతూన్న సాంప్రదాయాలూను. తరగడం పూర్తిచేసి, ఆ ముక్కలు మరోసారి నీళ్లతో కడిగి, వారిజకిచ్చి, సింకులో పడేసిన గిన్నెలు కడగడం మొదలెట్టాడు.

తను వచ్చి ఏడాదయింది. ఈఏడాదిలోనూ ఇలాటికథలు కొన్ని వందలసార్లు విన్నాడు. నలుగురు చేరినప్పుడల్లా ఇవే కబుర్లు. ముందుగదిలో శేఖరంతండ్రి సోమయ్య అటూ ఇటూ చూసి లేవబోతుంటే, గిరి గమనించి, ''ఏమిటండీ, ఏంకావాలి,'' అనడిగాడు. సోమయ్య, ''ఏంలేదు, కొంచెం మంచినీళ్లు, నేం తెచ్చుకుంటాలే,'' అన్నారు.

''మీరు కూచోండి, నే తెస్తా,'' అని, ముత్యాన్ని కేకేశాడు అతను. ముత్యం వచ్చి, మంచినీళ్లు తెచ్చి ఆయనకి అందించి మళ్లీ లోపలికి వెళ్లిపోయాడు. గిన్నెలు కడిగి బాబీ దగ్గర కూచున్నాడు. బాబీ లెక్కలు చేసుకుంటున్నాడు, తనకి తెలీనివి ముత్యాన్ని అడుగుతున్నాడు.

''చదువులో కూడా సాయం చేస్తున్నాడే, మంచి అబ్బాయినే సంపాయించారు. ఈరోజుల్లో మనూర్ల అసలు వొళ్లొంచి పని చేసే పాలేర్లు కనిపించట్లేదు,'' అంది కోటమ్మ.

వనజ ఉలిక్కిపడి, ''అయ్యయ్యో, పాలేరు కాదండీ. మామరిదిగారు. రెండేళ్ల క్రితం జబ్బు పడి, గొంతు పూడుకుపోయింది. ఇక్కడ ఆపరేషను చేయిద్దాంవని తీసుకొచ్చాం,'' అంది.

కోటమ్మ వదిలిపెట్టలేదు. ''మరి ఇంకా ఆపరేషను అవలేదా?''

వనజకి మహా సంకటం అయిపోయింది. అమ్మవంకా, అబ్బవంకా కాని ఈఆడకి తను సమాధానం చెప్పుకోవలసిరావడం!

''ఏదీ, ఎప్పటికప్పుడు అలానే అయిపోతోందండీ. ఆదిలో డాక్టరు పరీక్షలతోనే ఆర్నెల్లయింది. ఇంతలో మా చెల్లెలిపెళ్లి. కట్నం కాదు కాని ఖర్చులకని అడుగుతున్నార్ట పెళ్లికొడుకు తరుఫువారు. సర్దమని ఉత్తరాలమీద ఉత్తరాలు గుప్పించారు నాన్న. మాదగ్గర లేదంటే నిష్ఠూరం. అదయేసరికి ఇంటి రిపేర్లు. ఏటిపక్కన ఇల్లు ప్రశాంతంగా ఉంటుందని కొన్నాం. గట్టిగా నాలుగు వానలు పడేసరికి నీళ్లు ఇంట్లోకొచ్చేశాయి. పునాదులు కూరుకుపోతున్నాయి. వచ్చే వేసవిలోనేనా అవుతుందేమో చూడాలి,'' అంది.

కోటమ్మకి తాను అడిగిన ప్రశ్న అదికాదు అనిపించింది కాని ఊరుకుంది. చాలామంది అంతే మనం ఒకటడిగితే వారు మరొకటి చెబుతారు. ఏంచేస్తాం?

పక్కగదిలోంచి గిరిబాబు మాటలు వినిపిస్తున్నాయి, ''ఏమిటో మాస్టారూ, ఇక్కడ ఇన్ని కబుర్లు చెబుతారు కాని నిజంగా మనిషికి కాదు వీళ్లు విలువనిచ్చేది. టైమీజ్ మనీ అంటారు కాని వాళ్ల టైంకే విలువ, మనం ఎంత చేసినా ఇంకా, ఇంకా చేయించుకోవాలనే చూస్తారు. మీరు విన్నారో లేదో కాని, మనం రెండింతలు పనిచేస్తే, వాళ్లు తమవారికిచ్చేదాన్లో సగం చేతిలో పెడతారని ప్రతీతి. అది కూడా అక్కడికేదో మననుద్ధరిస్తున్నట్టు.''

''విలువలు వేరూ, బజారుధర వేరూను,'' అన్నారు సోమయ్యగారు నవ్వుతూ. అవును మరి, అవతలిమనిషి ఎదటివాడి సామర్థ్యం కాదు చూసేది, అది తనకెంతవరకూ వుపయోగం అన్నదాన్నిబట్టే దానికి విలువ కడతాడు. ఎవరిమటుకు వారికి, తమ ధనం మాత్రమే ఘనంగా కనిపిస్తుంది కాని తాము ఎదటివాడి శ్రమకి విలువ కడుతున్నాననుకోడు.

వనజ వచ్చింది లంచి సిద్ధం అంటూ.

ముత్యం బల్లమీద కంచాలూ, గ్లాసులూ అమర్చాడు. ఎనిమిదిమందికి సరిపోయే బల్ల. అందరూ కూర్చున్నారు. బాబీపక్కన ముత్యం కూర్చున్నాడు.

గిరి మళ్లీ మొదలెట్టాడు, ''అందరూ బోలెడు డాలర్లు సంపాదించేస్తున్నాం అనుకుంటారు కాని, ఎంతకష్టపడితే వస్తాయవి! మనవాళ్లన్నట్టుగా అవేం చెట్లకి కాయవు కదా. అసలు చదువు పూర్తయేసరికే, ఆస్తులు హరించుకుపోయేయి. ఎలాగో అయిందనిపించేం కాని, ఉద్యోగంలో చేరేక తెలిసింది నిజంగా కాయకష్టానికున్న విలువ. రోజుకి ముప్ఫైగంటలు గిలగిల్లాడినా, ఎప్పుడు ఏకష్టమరు ఏకష్టాల్లో ఇరికిస్తాడోనన్న భయమే. ఏకంపెనీ ఎప్పుడు మూత పడుతుందో, ఎప్పుడేం ముంచుకొస్తుందో అనుక్షణమూ బెదురే. ఇవాళున్న ఉజ్జోగం రేపుంటుందన్న భరోసా లేదు. ఇంతకష్టపడి సంపాదించిన సంపాదనమీద ఇంటిల్లిపాది ఆశలు పెట్టుకునుంటారు కదా. ఈమధ్య మాస్నేహితుడొకడు, మాఆఫీసులోనే ఉన్నాడు, దాదాపు కళ్లనీళ్లు పెట్టుకున్నాడు. తమ్ముళ్ల చదువులూ, చెల్లెళ్లకి చదువుల్తోపాటు పెళ్లిళ్లూ, వీటితో ఆరిపోతున్నానని. పైగా వాళ్ల మేనమామ ఎప్పుడో వాళ్లమ్మ పెళ్లికి పదివేలు అప్పు చేశానని ఇప్పటికీ దెప్పుతూనే వుంటాడుట. ఎన్నిమార్లు తీర్చేనో చెప్పలేను ఆపదివేలూను, ఆయనో, నేనో హరీమనేవరకూ తీరేలా లేదు ఆ అప్పు అన్నాడు,'' అంటూ నవ్వేడు గిరి. ఎంచేతో గాని పొరుగువాడి బాధలంత చక్కనిసబ్జెక్టు మరోటి దొరకదు కాలక్షేపం కబుర్లకి.

''టైము చూసుకో,'' అంది వనజ హెచ్చరికగా.

అతను గతుక్కుమని వాచీ చూసుకుని, గబగబ నాలుగు మెతుకులు కతికి, ''సాయంత్రం మాటాడుకుందాం. మీరు పడుకోండి, '' అని చెప్పేసి వెళ్లిపోయాడు.

సాయంత్రం గిరి కొంచెం ఆలస్యంగా వచ్చాడు. హాల్లో కూచుని విడియో చూస్తున్నారు అందరూను. హాయ్ అన్నాడు బాబీ తండ్రిని చూడగానే. వనజా, శేఖరమూ గిరి మొహం చూసి గతుక్కుమన్నారు. అతని మొహం పాలిపోయి ఉంది. ఆర్నెల్లనుండి అన్నం తినని వాడిలా నీరసపడిపోయాడు.

''ఏంవయింది? ఒంట్లో బావులేదా?'' అంది వనజ లేచి దగ్గరికి వస్తూ.

గిరి ఏమీలేదన్నట్టు సైగ చేసి లోపలికెళ్లిపోయాడు. వారిజ అతన్ని అనుసరించింది. ఓపావుగంటయింతరవాత ఇద్దరూ హాల్లోకి వచ్చారు. అతనివుద్యోగం ఆరోజుతో సరి.

అయ్యో అంటూ సానుభూతి వెలిబుచ్చారు శేఖరం, సోమయ్యగారూను. నెమ్మదిగా గిరి సంగతి వివరించాడు. మేనేజ్మెంటు కొంగ్రొత్త పద్ధతులలో కంపెనీని పునరుద్ధరించదల్చుకున్నారుట. గిరిస్థానంలో అప్పుడే యేల్‌నించి దిగివచ్చిన యువకుడిని

వేసుకున్నారు. గిరిని పొమ్మనలేదు కాని అతనికి చూపిన మరో స్థానం మాత్రం అతనిసామర్థ్యానికి తగినది కాదు. ''కాదు, కాదు, ఇందులో నువ్వు ఎంతైనా పైకి రావచ్చు'' అన్నాడు వాళ్ల మేనేజరు. గిరి ఉడికిపోతూ ఇల్లు చేరుకున్నాడు. వారంరోజులు వ్యవధి ఇచ్చారు తన జవాబు చెప్పడానికి.

''నిన్న మనం అనుకున్నాం ఈమాటే. మీరు చెప్పండి, మాష్టారూ, ఒకమనిషి సామర్థ్యానికి విలువ ఎలా కడతారు ఎవరైనా?'' అన్నాడు గిరి. అతనిగొంతులో నిన్నటి ఔద్ధత్యం కనిపించడంలేదు మచ్చుకైనా!

శేఖరం కొంచెంసేపు మాటాడలేదు. తరవాత నెమ్మదిగా, ''ఎవరికొలమానాలు వారివి, గిరీ. నీకున్న సామర్థ్యానికీ, వాళ్లకి కావలసినదానికీ పొందిక లేకపోవచ్చు. వాళ్లు చూసేదల్లా ఎంత చవగ్గా వాళ్ల పని అయిపోతుందనే. నీదృష్టిలో నీడాలరుకున్న విలువే వారి దృష్టిలో వారి డాలరుకుంది. ఆరెండు దృక్కోణాల్లో తేడా నీకు తెలిసే వుంటుంది.''

లేదు. తనకి ఆరెండు దృక్కోణాల్లో తేడా కనిపించడం లేదు. అది అతని దృష్టిలోపం అనడానిక్కూడా లేదు. క్లాసుల్లోనూ, పుస్తకాల్లోనూ విశ్లేషించే తేడా కాదది. మాష్టారు చూడకుండా గిరి పళ్లు కొరుక్కున్నాడు. పరిస్థితులు గమనించి, శేఖరం, వాళ్లూ తెల్లారుతూనే ప్రయాణం అయేరు.

''అదేంటి, రెండురోజులుంటాం అన్నారు కదా, ఉండండి. ఫరవాలేదు, ఆమాత్రం పెట్టలేకపోం,'' అన్నారు, గిరీ, వనజా నొచ్చుకుంటూ.

''మీరు పెట్టలేరని కాదు, గిరీ, వెదరు బావుంది. వాళ్లిద్దరూ పెద్దవాళ్లు కదా, అట్టే ఆయాసపడలేరు. ఇప్పుడు బయల్దేరితే, మధ్యాన్నానికల్లా ట్విన్‌సిటీస్ చేరుకుంటాం. మళ్లీ వస్తాంలే,'' అని శేఖరం సర్దిచెప్పాడు.

''బ్రేక్‌ఫాస్టు తిని బయల్దేరండి,'' అంది వనజ.

''నాకేం పాలుపోవడంలేదు, మాస్టారూ, మీసలహా ఏమిటి?'' అన్నాడు గిరి సోమయ్యగారితో. ఆయన మాస్టారు కాకపోయినా, పెద్దవారు కనక తత్తుల్యుడే మరి.

సోమయ్య నెమ్మదిగా తన అభిప్రాయం వివరించారు, ''గిరీ, ఆరెండో ఉద్యోగంలో చేర్తావో లేదో నాకు తెలీదు. కాని నాకు అర్థం కానిది చెప్తాను. ఇక్కడికొచ్చాక, లేదా, ఈకాలంలోనే అనుకో, ఎంతసేపూ తానెంతవరకూ రాబట్టుకోగలనన్న యావే కనిపిస్తోంది ఎవర్ని చూసినా. ఈ తగ్గింపుధరలూ, ఉచితంగా ఇచ్చే వస్తువులూ చూడు. కారు కొంటే సైకిలు ఉచితం. నువ్వు సైకిలు కావాలని కారు కొనవు. కారు కొంటే దాంతో వచ్చే సైకిలుధర కారుధరలో ఇమిడివుంటుందని నీ బుద్ధికి తెలుసు. అయినా సరే, కారుతోపాటు సైకిలు తెచ్చుకుని మహదానందం పొందుతావు. అలా ఉచితంగా వచ్చినవాటితో మావాడింట్లో ఓగది నిండిపోయింది. పూర్వం మాతాత ఒక కొబ్బరికాయ కొంటే, మరో కొబ్బరికాయ కొసరడిగేవాడట, ఆమాట చెప్పి మాఅమ్మ నవ్వుతూండేది. నిన్న అందుకే అన్నాను, విలువలు వేరూ, బజారుధర వేరూనని. ఉదాహరణకి, నువ్వు నీ రెస్యూమేలో నీకు కర్ణాటసంగీతం వచ్చుననీ, అంచేత నీ కాతాదార్లతో కర్ణపేయంగా మాటాడి ఒప్పించగలననీ రాస్తావనుకో. అది మీ మేనేజరుకి నచ్చితే సరే, లేకపోతే, నాక్కావలిసింది బిజినెస్ ఎకూమెన్ కాని నీసంగీతం కాదయ్యా, అని కొట్టిపారేస్తాడు. అంటే నీవిద్యలో తనకి పనికొచ్చేదానికి మాత్రమే విలువ కట్టేడు మీ మేనేజరు. నీ అవసరాన్నిబట్టీ, నీఓపికని బట్టీ నువ్వు నీధర కట్టుకుంటున్నావు. ఇంతకీ నాప్రశ్న, ఈసంగతి అందరికీ తెలిసినా, క్రియదగ్గరికొచ్చేసరికి, ఎవరూ గమనించరు, ఎందుచేత?''

గిరికి ఆయన మాటలు అర్థం కాలేదు. తను అడిగిందేమిటి? ఆయన చెబుతున్నది ఏమిటి?

ముత్యం సామాను తెచ్చి కార్లో పెట్టాడు. సోమయ్యగారికేం అనిపించిందో ముత్యం దగ్గరికొచ్చి, అతని బుజం తట్టి, చేయందుకుని ఓనోటు ఆచేతిలో పెట్టారు. ముత్యం వద్దంటూ తలూపాడు కాని ఆయన తనచేత్తో అతని గుప్పిడి మూసి, వెళ్లి కార్లో కూచున్నారు. కారు కదిలాక, గిరీ, వనజా లోపలికెళ్లిపోయారు.

ముత్యం అక్కడే నిలుచున్నాడు స్థబ్దుడై. అతని గుప్పిట్లో నోటు నలుగుతోంది. మనసు నలికలపాములా మెలికలు తిరుగుతోంది. అమ్మ మాటలు జ్ఞాపకం వొచ్చేయి, ''గుప్పిడి మూసినంతసేపే గారడీ.''

బాబీ పక్కన నిల్చుని ఏమిటదని అడిగాడు. ముత్యం అతనివేపు ఓక్షణం చూసి, తన ముష్టివైపు చూసుకున్నాడు. తనున్న పరిస్థితుల్లో దీని విలువెంత?

''చూపించు,'' అంటున్నాడు బాబీ చొక్కా పుచ్చుకు లాగుతూ.

ముత్యం వేళ్లు సడలి సుతారంగా కలువరేకుల్లా విచ్చుకున్నాయి. ఓ పిల్లగాలొచ్చి అతని చేతిలోని కాయితం నొల్లుకుపోయింది. నిన్నటి గవ్వే నయం, కాస్త వూపు కావాల్సొచ్చింది విసరడానికి. ఆ గుడ్డిగవ్వపాటి చెయ్యలేదు ఈపచ్చ కాయితం.

(మే 2004)